

కొనసాగుతున్న డీఎస్సీ పరీక్ష

- పరిశీలించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 19: డీఎస్సీ పరీక్ష రెండోరోజు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగింది. జిల్లా కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జేపీఎన్‌సీఈ పరీక్షా కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డెరెక్టర్ వెంకటనరసింహారెడ్డి తనిఖీ చేశారు. జేపీఎన్‌సీఈలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 173 మంది, మధ్యాహ్నం 181 మందికి 178 మంది హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో ఉదయం 184 మందికి 172 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 185 మందికి గాను 182 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కదిలిన యంత్రాంగం

- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న కలెక్టర్లు

కలెక్టర్లందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని, చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్లలో ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు . జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారమైతే, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వచ్చే అర్జీల సంఖ్య తగ్గిపోతుందన్నారు. దీంతో శుక్రవారం పాలమూరు ఉమ్మడి జిల్లా యంత్రాంగం కదిలింది. కలెక్టర్లు తమ జిల్లాలోని ఒక మండలాన్ని ఎంపిక చేసుకొని పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయాలు, పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీ చేశారు. కేజీబీవీలలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గుండుమల్ పీహెచ్‌సీ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండటంతో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గండీడ్ మండలంలోని ఎస్‌బీఐని తనిఖీ చేసిన మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి రైతులను ఇబ్బంది పెట్టొద్దని మేనేజర్‌కు సూచించారు. బిజినేపల్లి మండలంలో పర్యటించిన నాగర్‌కర్నూల్ కలెక్టర్ గురుకుల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులతో పాఠాలు చదివించారు.



గండీడ్ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న పాలమూరు కలెక్టర్ విజయేందిర బోయి



గండీడ్ బ్యాంకులో రుణ మాఫీ గురించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్ విజయేందిర బోయి

గండీడ్ : బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం గండీడ్ మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, ఎస్‌బీఐ, పీహెచ్‌సీలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ధరణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, కేజీబీవీ భవన నిర్మాణ స్థలం సర్వే విషయాన్ని అడిగారు. అనంతరం ఎస్‌బీఐని తనిఖీ చేశారు. రుణ మాఫీ అయిన రైతుల జాబితాను పరిశీలించి రైతులకు మాఫీ డబ్బులు ఎలా ఇస్తున్నారని మేనేజర్ శరత్ చంద్రను అడిగి తెలుసుకున్నారు. రెన్యువల్ చేసుకున్న రైతులకు వారి ఖాతాలో జమ చేస్తామని మేనేజర్ తెలిపారు. రుణమాఫీ విషయంలో అర్హులైన రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని బ్యాంకు వారికి సూచించారు. అనంతరం పీహెచ్‌సీ తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. వెన్నాచేడ్‌లో నిర్వహిస్తున్న టీబీ క్యాంపులో వసతులు ఎలా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అధికారులు తీరు మార్చుకోవాలి : కలెక్టర్

కోస్గి : సిబ్బంది తీరు మారకపోతే చర్యలు తప్పవని గుండుమల్ పీహెచ్‌సీ సిబ్బందిని నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ హెచ్చరించారు. శుక్రవా రం గుండుమల్ పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేసిన సందర్భంగా ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచాలపై బెడ్‌సీట్లు లేకపోవడమేంటని డాక్టర్ కిష్టమ్మను ప్రశ్నించారు. ఇక్కడ బెడ్‌సీట్లు ఎత్తుకెళ్తున్నారని సమాధానమివ్వడంతో మీరేం చేస్తున్నారని మండిపడ్డారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోగారం జడ్పీ హెచ్‌ఎస్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుకుంటున్నారు. పాఠాలు అర్థమౌతున్నాయా అని అడిగారు. ఏదైనా అర్థం కాకుంటే ఉపాధ్యాయులను అడిగి నేర్చుకోవాలన్నారు. అనంతరం పాఠశాల, పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తర్వాత కోస్గి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాల యాలను తనిఖీ చేశారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలన్నారు. భూ సమస్యలగురించి రైతులు కార్యాలయం చుట్టూ తిరగవద్దన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులున్నారు.



బిజినేపల్లిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు

సద్వినియోగం చేసుకోవాలి

-కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి: గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గురుకుల భవన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. గురుకులానికి సొంత వసతి గృహం లేకపోవడమే ప్రధాన సమస్యగా ఉందని ప్రిన్సిపాల్ సుమతి కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఫిట్స్ వచ్చి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థి వద్దకువెళ్లి మెరుగైన వైద్యం అందించేందుకు జిల్లా ఆస్పత్రికి తరలించాలని అధికారులకు సూచించారు. విద్యార్థి తక్షణ ఖర్చుల కోసం కొంత నగదు అందించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతలప్ప, వైద్యాధికారి డాక్టర్ శివ కుమార్ ఉన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా

చర్యలు తీసుకోవాలి

- రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్ : దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య చర్యలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. శుక్రవారం సాయంత్రం అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులను పరిశీలించి, విద్యార్థులతో పాఠా లు చదివించారు. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. తెలుగుతో పాటు ఆంగ్ల బాషలో కూడా విద్యార్థులకు మంచి ప్రావీణ్యం కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలో 123 మంది విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంటున్నారని వార్డెన్ కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పారిశుధ్య నిర్వహణ పక్కాగా నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర, ఎంఈవో సురేష్, జిల్లా కోఆర్డినేటర్ ఈస్టర్ రాణి, వార్డెన్ ఉన్నారు.



అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులతో పాఠం చదివిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

నల్లబెల్లం పట్టివేత

మహబూబ్‌నగర్, జూలై 19: ప్రభుత్వం సారాను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటుండగా, కొందరు అక్రమ పద్ధతిలో సారా తయారు చేసేందుకు కావలసిన సామగ్రిని పల్లెలకు సరఫరా చేస్తూనే ఉన్నారు. కర్ణాటక నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నల్లబెల్లం, పటిక సరఫరా చేస్తున్నారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం అర్ధరాత్రి పాలమూరు బైపాస్‌లో నల్లబెల్లం తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో 1,500 కిలోల నల్లబెల్లం, 40 కిలోల పటిక, నాలుగు లీటర్ల సారను స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేటకు చెందిన గొల్లరవి, మహబుబాబాద్‌కు చెందిన ఉపేంద్రాచారి కొన్ని రోజులుగా కర్ణాటక నుంచి సారా తయారికి ఉపయోగించే నల్లబెల్లం, పట్టికను నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, సూర్యపేట, మహబుబాబాద్ జిల్లాల కు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వెంకటేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శారద, ఎస్‌ఐ సృజన్‌రావు పాల్గొన్నారు.



పట్టుబడ్డ నల్లబెల్లంతో నిందితులు

మీ కుమారుడు రేప్ కేసులో ఉన్నాడు

డబ్బులిస్తే మాఫీ చేస్తాం

- మోసపూరిత ఫోన్‌కాల్‌తో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గద్వాల క్రైం, జూలై 19 : నేను ఒక పోలీస్ అధికారిని... మీ కుమారుడు ఒక యువతిని రేప్ చేశాడు.. మీ కుమారుడిని అరెస్ట్ చేసి స్టేషన్‌లో కోటింగ్ ఇస్తున్నాం... ఆ యువతి ప్రస్తుతం చావు బతుకుల మధ్య ఉన్నది.. కేసు తీవ్రత ఇంకా పెరిగే పరిస్థితి ఉన్నది.. మాకు రూ.50 వేలు ఫోన్‌పే లేదా గుగూల్ పేలో పంపిస్తే మీ అబ్బాయిపై ఉన్న కేసును తొలగిస్తాం... శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ వ్యక్తికి పోలీస్ అధికారులమంటూ వాట్సాప్ కాల్ ఇలా వచ్చింది. దీంతో ఆ కుటుంబం అంతా భయభ్రాంతులకు గురై పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల కథనం ఇలా ఉన్నది. గద్వాల పట్టణంలోని మూడో వార్డుకు చెందిన ఓ వ్యక్తి కుమారుడు హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేసి తన మిత్రుడితో కలిసి పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. శుక్రవారం గద్వాలలో ఉన్న ఆ విద్యార్థి తండ్రికి ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి నేను ఓ పోలీస్ ఉన్నతాధికారిని అంటూ పరిచయం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న మీ కుమారుడు ఓ యువతిని రేప్ చేశాడని, అతనిపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీస్ స్టైల్‌లో కోటింగ్ కూడా ఇస్తున్నామని బెదిరించాడు. అయితే ఈ విషయాలను వింటున్న ఆ విద్యార్థి తల్లిదండ్రులు వెంటనే ఆవేదన చెందుతూ తమ కుమారుడు అలాంటి వాడుకాదని, మీరు ఏదో పొరపాటు పడుతున్నారని చెప్పేందుకు ప్రయత్నించగా వారి కుటుంబ వివరాలను సరిగ్గా అవతలి వ్యక్తి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అవతలి వ్యక్తి సరే మీ అబ్బాయి విద్యార్థి కావడంతో కేసులు అయితే అతని జీవితం నాశనం అవుతుందని, తనకు రూ. 50 వేలు ఫోన్‌పే లేదా గూగుల్‌పే చేస్తే కేసును తీసివేస్తానని చెప్పాడు. దీంతో బాధితుడికి అనుమానం వచ్చి అతడితో మాట్లాడుతూనే తన భార్య ఫోన్ ద్వారా హైదరాబాద్‌లోని తన కుమారుడికి ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ఇదంతా సైబర్ నేరం అని భావించి మీకు డబ్బులు ఏ నెంబర్‌కు పంపాలని అడుగగా వెంటనే పోలీస్ అధికారిని అని చెప్పే వ్యక్తి వెంటనే 7751054319కు వెంటనే పంపించాలని, లేదంటే మీ కుమారుడు ఇబ్బంది పడతాడు అని ఫోన్‌కాల్ కట్ చేశాడు. అయితే జిల్లా కేంద్రానికి చెందిన ఈ వ్యక్తి పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. దీంతో ఎస్‌ఐ వెంటనే స్పందిస్తూ ఇది అంతా మోసం అని, ఇలాంటి నెంబర్లు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్‌పే చేయాలన్న నంబర్‌ను ట్రేస్ అవుట్ చేసి వివరాలను సేకరిస్తామని హామీ ఇచ్చారు.

పరుగో.. పరుగు

నిత్యావసర సరకుల కోసం గుర్రంగడ్డ గ్రామస్థుల తిప్పలు

- కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డు
- మరమ్మతులు చేయక మూలనపడ్డ పవర్ బోటు
- వరద పెరిగితే ఇతర గ్రామాలతో సంబంధాలు కట్
- పవర్‌బోటు కొత్తది కొనాలంటున్న స్థానికులు


గద్వాల, జూలై 19: కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడల్లా బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే దీవి గ్రామం గుర్రంగడ్డకు ఈ సారి మరింత కష్టం వచ్చింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నదిని దాటే గ్రామస్థులకు పవర్‌బోటు కరువైంది. మరమత్తులు చేయించాల్సిన అధికారులు చేతిలెత్తేయడంతో మూలనపడ్డది. జూరాల ప్రాజెక్టు నుంచి జల ఉత్పత్తికోసం వదిలిన 30వేల క్యూసెక్కుల వరద గ్రామాన్ని చుట్టుముట్టింది. రంగాపురం వైపు వేసిన తాత్కాలిక మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. మరింత వరద పెరిగితే బయటకు వెళ్లలేమని గ్రహించిన గ్రామస్థులు నిత్యావసర సరకుల కొనుగోలు చేయడానికి పెబ్బేరు వైపు పరుగులు పెడుతున్నారు. రోడ్డు పూర్తిగా కొట్టుకుపోకముందే బతుకు జీవుడా అంటూ గ్రామంలో పడ్డారు. ఇందుకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి.



కొట్టుకుపోయిన రంగాపురం వైపు వెళ్లే తాత్కాలిక రోడ్డు

నత్తకు నడకనేర్పుతున్న పనులు

దీవి గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఐదున్నరేళ్ల క్రితం 2018 ఎన్నికల సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్రంగడ్డకు బ్రిడ్జిని మంజూరు చేశారు. ఆ వెంటనే రూ.9.47కోట్ల నిధులను కేటాయిస్తూ జీవో జారీ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. 33 పిల్లర్లు నిర్మించాల్సి ఉండగా 18పిల్లర్లు సగం వరకు నిర్మించి నిలిపివేశారు. ఈ ఏడాది ఎలాంటి పనులు చేయలేదు. గ్రామస్థులు బ్రిడ్జి నిర్మాణం పూర్తి కోసం ఎదురు చూస్తున్నారు. ఇక పుట్టీ, పవర్ బోటు ప్రయాణం తప్పదు అన్నట్లుగా వారు దానినే నమ్ముకున్నారు. దానికోసమే వారి ప్రయత్నాలు మొదలు పెట్టారు.



మరమ్మతులు లేక మూలనపడ్డ పవర్ బోటు

ధ్వంసమైన పవర్‌బోటు..

పదేళ్లుగా ఉపయోగిస్తున్న పవర్‌బోటు పాడైపోయింది. కొత్త పవర్‌బోటు కావాలని గ్రామస్థులు ప్రతీ ఏడాది కలెక్టర్‌తో పాటు ఫిషరీష్ అధికారులకు విన్నవిస్తున్నారు. ఏడాదికేడాది దానికి మరమ్మతులు చేయిస్తున్నారు. కానీ ఈ ఏడాది పవర్‌బోటు మరమ్మతులు చేసినా ఉపయోగం లేదని అంటున్నారు. బీరోలు వైపు నడిపే ఈ పవర్‌బోటు నదిలో సుడులు, రాళ్లను తప్పించుకుంటూ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. పూర్తిగా పాడైపోయిన ఈ బోటుకు మరమ్మతులు చేసి నిర్వహిస్తే ఏదైన రాయి తగిలితే ప్రమాదం జరుగు తుందని అధికారులు గుర్తించి మరమ్మతులు చేయలేదు. కొత్త పవర్‌బోటు కొనుగోలు చేయడానికి కలెక్టర్ నిర్ణయం కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. కలెక్టర్ ఆమోదించగానే 20 రోజులలో కొత్తదానిని నాణ్యతతో తయారు చేయిస్తామని తెలిపారు.

50వేల క్యూసెక్కులు దాటితే ప్రయాణం ఎలా..?

జూరాల ప్రాజెక్టు నుంచి జల ఉత్పత్తికోసం దాదాపు 30వేల క్యూసెక్కుల వరదను వదిలారు. శుక్రవారం రాత్రికి లేదంటే తెల్లవారుజామున జూరాల గేట్లు తెరుచుకునే అవకాశం ఉంది. నారాయణపూర్ జలాశయం నుంచి 65వేల క్యూసెక్కుల వరద జూరాలకు వస్తుంది. వచ్చిన వరద వచ్చినట్లు శ్రీశైలానికి వదులుతారు. ఈ వరద వస్తే మాకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని మేము బయటకు ఎలా రావాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. పాత పవర్‌బోటుకు మరమత్తులు చేయలేదు.. కొత్తదానిని కొనుగోలు చేయలేదు, ఆపద వస్తే ఎలా బయటకు రావాలని వారు నిలదీస్తున్నారు. బీరోలు వైపు ప్రవాహవేగం ఎక్కువ, సుడులు ఉంటాయి.. పుట్టీ ప్రయాణం ప్రమాదం అని దీవి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసు ఇచ్చుకో..

నోట్లు పట్టుకో

- నిబంధనలు పాటించని ఆర్ఎంపీలకు నోటీసులు
- సీజ్ చేసిన క్లినిక్‌లకు అనుమతులు
- ఒక్కో క్లినిక్ అనుమతికి దాదాపు రూ. 80 వేలు..?
- డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో కొనసాగుతున్న దందా
- కీలకంగా వ్యవహరిస్తున్న మాస్ మీడియా విభాగం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 19: నోటీసులు ఇచ్చుకో... నోట్లు తీసుకో.. అని ఇదేదో ప్రాసకోసం పెట్టిన వాక్యం అనుకుంటే పొరపాటే. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అధికారులకు కరెక్ట్‌గా సరిపోతోందని చెప్పొచ్చు. ఎందుకంటే ముందుగా ఆర్ఎంపీ క్లినిక్‌లపై దాడులు చేయడం... నిబంధనలు పాటించడం లేదని నోటీసులు ఇవ్వడం, మితిమీరితే వాటిని సీజ్ చేయడం ఆ అధికారుల వంతు. కానీ ఇందులోనే మరో తంతు దాగుంది. నోటీసులు జారీ చేసిన క్లినిక్‌ల యాజమానులతో సమాధానానికి బదులు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సీజ్ చేసిన క్లినిక్‌లకు నెల గడవక ముందే అనుమతులు ఇస్తున్నారు. దీనికి కూడా ఒక రేటు ఫిక్స్ చేశారు. కార్యాలయంలోని మాస్ మీడియా విభాగం ఈ వ్యవహారాలన్నింటిలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆర్ఎంపీ క్లినిక్‌లకు నోటీసులు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆర్ఎంపీలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మాస్ మీడియా విభాగం అధికారులు దాడులు చేశారు. ఆ దాడులు కూడా జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న దేవరకద్ర, భూత్పూర్, జడ్చర్ల, మిడ్జిల్, రాజాపూర్ ప్రాంతాల్లోని క్లినిక్‌లపై దాడులు చేశారు. జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మండల కేంద్రాలలోని 10 ఆర్ఎంపీ క్లినిక్‌లకు నోటీసులు జారీ చేశారు. కొంతమంది హైడోస్ యాంటీ బయోటిక్స్ ఇస్తున్నారని, బెడ్స్ పెట్టుకొని సెలైన్లు పెడుతున్నారనే కారణాలతో గత నెల 25న నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన 7నుంచి 15 రోజుల్లోగా సమాధానం పంపాల్సి ఉంటుంది. కానీ సమాధానానికి బదులు నోట్ల కట్టలు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో క్లినిక్ వద్ద రూ. 20 నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. జడ్చర్లలోని ఓ క్లినిక్‌లో నాలుగు మంచాలు పెట్టుకొని సెలైన్లు పెడుతున్నట్లు నోటీసులు జారీ చేసిన విషయంలో ఆ క్లినిక్ నుంచి రూ. 30వేలు తీసుకున్నారని తెలిసింది. డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి ఇచ్చిన నోటీసులలో పేర్కొన్న ఏ అంశంపై సమాధానం ఇవ్వకపోగా, యాథావిధిగా కొనసాగుతుండడం విశేషం.



ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న మాస్ మీడియా అధికారులు(ఫైల్)

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు..

సీజ్ చేసిన ఏ ఒక్క ఆర్ఎంపీ క్లినిక్‌లకు తెరుచుకునేందుకు అధికారికంగా అనుమతి ఇవ్వలేదు. నోటీసులు ఇచ్చి డబ్బులు వసూలు చేయడం కూడా నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేయిస్తా. అనుమతి లేకుండా తిరిగి తెరిచిన క్లినిక్‌లను మూసి వేయిస్తాం. నిబంధనలు పాటించని ఆర్ఎంపీ క్లినిక్‌లను శాశ్వతంగా మూయిచేందుకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ కృష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

యాంటీబయోటిక్స్ ఇస్తున్నారనే..

గత నెలలో క్లినిక్‌లపై మాస్ మీడియా అధికారులు దాడులు చేశారు. భూత్పూర్‌లోని అమ్మక్లినిక్, మిడ్జిల్‌లోని ప్రజా వైద్యశాల, వెంకటేష్ క్లినిక్, జడ్చర్లలోని శివ క్లినిక్‌లను హైయాంటీ బయోటిక్స్ ఇస్తున్నారనే కారణంతో సీజ్ చేశారు. జడ్చర్లలోని శివక్లినిక్, భూత్పూర్‌లోని అమ్మక్లినిక్‌లు సీజ్ చేసిన 15రోజుల్లోనే తెరుచుకోవడం చూస్తే పెద్ద మొత్తంలోనే మామూళ్లు ముట్టినట్లు తెలుస్తోంది. భూత్పూర్‌లోని క్లినిక్‌లో అర్హతలేని యువకుడు రోగులకు చికిత్స చేయడం కొసమెరుపు. అయితే రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఎక్కువ అయ్యాయని, తాము ఏం చేయలేమని చెప్పుకుంటున్నారు. ఓ మంత్రి, ఎమ్మెల్యే చెప్తేనే సీజ్ చేసిన వాటికి అనుమతులు ఇచ్చామంటున్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

- సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

తిమ్మాజిపేట, జూలై 19 : కోతలు లేని విద్యుత్‌ను అందించాలని విద్యుత్ సమస్య పరిష్కరించాలని రైతులు శుక్రవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని గొరిట శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్న చేగుంట గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. తాము వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని తరచూ విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని పలు పర్యాయాలు విద్యుత్ అధికారులకు చెప్పినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యను పరిష్కరిస్తూ కోతలపై ముందుగానే రైతులకు సమాచారమివ్వాలని వారు అధికారులను కోరారు. రైతులు గాలిరాజు, వెంకటరెడ్డి, చెన్నయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

అరుణాచలం బస్సును ప్రారంభించిన ఆర్‌ఎం



జెండా ఊపి బస్సును ప్రారంభించిన ఆర్ఎం. శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 19 :పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణ చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ డిపో నుంచి మూడు బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నుంచి రెండు, షాద్‌నగర్ నుంచి ఒక ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరతాయని అన్నారు. అరుణాచలం వెళ్లే మార్గమధ్యలో భక్తులు కాణిపాకం వరసిద్ధి వినాయకుడు, వేలూరు గోల్డెన్ టెంపుల్ ను దర్శించుకుంటారని తెలిపారు. 21న గిరి ప్రదక్షిణ అనంతరం తిరుగు ప్రయాణం ఉంటుందని తెలిపారు. అరుణాచలం యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌యం లక్ష్మీధర్మ, పీవో శ్రీనివాస్‌రెడ్డి, బసప్ప, భానుప్రకాష్ రెడ్డి, శర్మ, బాలస్వామి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది ఫాంహౌస్ పాలన

మాది ఫార్మర్ పాలన



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, జూలై 19: గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన ఫాంహౌస్‌లో సాగితే.. మా పాలన ఫార్మర్ పాలనలా సాగుతున్నదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసినందుకు కృతజ్ఞతగా శుక్రవారం అచ్చంపేట పట్టణంలో రైతులతో కలిసి నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద రైతులనుద్దేశించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలవాలంటే వారికి అనుమతి ఉండకపోయేదని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రిని ఎవరైనా కలిసే అవకాశం ఉంటుందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రతీ కుంట భూమికి సాగునీరందేలా సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఎస్సెఎల్‌బీసీ వన్ ద్వారా ఘన్‌పూర్, బక్కలింగాయపల్లి, అక్కారం గ్రామాలకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇచ్చిన వ్యవసాయ పనిముట్ల సబ్సిడీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, మళ్లీ మా ప్రభుత్వం సబ్సిడీపై పనిముట్లు ఇచ్చేలా కార్యాచరణ చేపడుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రూ.16 వేల కోట్ల రూపాయలు రైతులకు రుణమాఫీ చేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 31వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనా విధానాన్ని ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. భారతదేశంలో ఎవరూ చేయని విధంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందని, అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని అన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఊర్కొండ, జూలై 19: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 11న మూసాపేట మండలం జానంపేట గ్రామానికి చెందిన కుమ్మరి సురేష్ (33) కల్వకుర్తికి తన స్వంత పనుల నిమిత్తం ఆటో తీసుకొని బయలుదేరాడు. కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఊర్కొండపేట శివారులోని కాటన్‌మిల్లు వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. స్థానికులు గుర్తించి తీవ్ర గాయాలైన సురేష్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా..

శుక్రవారం మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి మామ వడ్ల చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహానికి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని పేర్కొన్నారు.

పీర్ల ఇనాం భూమి కబ్జా

- పీర్ల మసీదు వద్ద గ్రామస్థుల ఆందోళన

- పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పెద్దల సమావేశం



కౌలు చేస్తున్న వ్యక్తి వద్ద నుంచి ఒప్పంద పత్రాన్ని తీసుకుంటున్న గ్రామస్థులు

రేవల్లి, జూలై 19 : పీర్ల ఇనాం భూమి కబ్జా చేసి అమ్ముకున్నాడని వచ్చిన ఆరోపణల మేరకు శుక్రవారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం తలుపునూరులో గ్రామ పెద్దలు గ్రామస్థుల సమక్షంలో పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. గ్రామంలో మొల్లతనం చేస్తున్న బాలేషా, మదన్‌షాలు ఇద్దరూ పీర్ల ఇనాం భూమిని దున్నుకొని గ్రామంలో పీర్ల పండుగ, మైబుసాలా పండుగ నిర్వహించాలని సూచిస్తూ గ్రామ పెద్దలు గ్రామంలోని 137 సర్వే నెంబర్‌లో గల 13 ఎకరాల 36 గుంటల భూమిని వారి జీవనం కోసం ఇచ్చారు. ఇందులో మదన్‌షా వారసులు తొమ్మిది మంది వారి భాగానికి వచ్చిన భూమిని సాగు చేస్తూ రెండేళ్లుగా అన్ని పండుగలు నిర్వహిస్తూ వస్తుండగా, బాలేషా వారసుడైన కరీం గ్రామ శివారులో జీవిస్తూ గ్రామంలో చేయాల్సిన పైపండుగలు చేయకపోగా అతని భాగానికి వచ్చిన ఏడెకరాల భూమిలో కొంత భూమిని కౌలుకు ఇచ్చి.. కొంత భూమిని ఇతరులకు అమ్మాడని వచ్చిన ఆరోపణల మేరకు శుక్రవారం గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించారు. కరీం నుంచి పొలం కౌలుకు తీసుకున్న పెద్దాపురం గ్రామానికి చెందిన బాలపీరును పిలిపించి పండుగలకు కావాల్సిన ఖర్చులు ఇవ్వాలని, లేకపోతే నేటి నుంచి పొలంలో అడుగు పెట్టొద్దని సూచించారు. ఈయేడాది విత్తనాలు వేశావు కనుక ఈసారి పంట పంపిన అనంతరం మళ్లీ పొలంలోకి రావద్దని గ్రామస్థుల సమక్షంలో తీర్మానించారు. రెండురోజుల్లో రూ.50వేలు ఇస్తానని, లేకపోతే పొలంలో అడుగు పెట్టనని తీర్మానపత్రం రాసి గ్రామస్థులకు బాలపీరు అందజేశారు. కాగా, మొల్లతనం వారు లేకనే పది రోజులు చేయాల్సిన పీర్ల పండుగ ఆలస్యంగా మొదలు పెట్టి ఐదు రోజులే నిర్వహించారని అలా చేస్తే గ్రామానికి ఏదైనా అరిష్టం జరుగుతుందేమోనని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేశారు.

జవాబుదారీతనంతో పని చేయాలి

- కాలువలు పూడిస్తే ఆస్తుల జప్తు

- కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు రిలీవ్ చేయొద్దు - మంత్రి జూపల్లి కృష్ణారావు



సంగినేనిపల్లిలో వర్షంలోనే పర్యటిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనలో అధికారులు నిజాయితీగా జవాబుదారీతనంతో పని చేయాలని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం రెవెన్యూ, విద్యుత్, సాగునీటి సమస్యలపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు సంగినేనిపల్లి గ్రామంలో పర్యటించి, పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. సమస్యలపై ప్రజలతో దరఖాస్తులను స్వీకరించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాగునీటి కోసం తీసిన కాల్వలను పూడిస్తే వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. కాలువల వెంట వెళ్లేందుకు రెండు వైపులా బాటలు ఉండాలని వాటిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బీమా కాలువల్లో జమ్ము, సిల్ట్ మరమ్మతుల కోసం రూ.కోటి 50 లక్షలు అవసరం అవుతాయని అధికారులు తెలిపారని, మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ కాంట్రాక్టర్లు బిల్లును తీసుకొని రైతులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవన్నారు. వీపనగండ్ల ఎస్సీ కాలనీ పాఠశాల అపరిశుభ్రంగా ఉందని ఆరోపణలు ఉన్నాయని తహసీల్దార్ సందర్శించాలని తెలిపారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌలిక వసతుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్త ఉపాధ్యాయులు వచ్చేంత వరకు పాత వారిని రిలీవ్ చేయొద్దని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్‌ను ఆదేశించారు.

మంత్రికి వినతులు

సింగోటం, గోపల్‌దిన్నె రిజర్వాయర్ల అనుసంధాన కాలువలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మంత్రికి వినతిపత్రం అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు.


ఆరడుగుల హరీశ్‌రావు మాట నిలబెట్టుకోవాలి

- ఏడో గ్యారెంటీగా ప్రజాపాలన - ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జూలై 19 : ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని, ఏడవ గ్యారెంటీగా ప్రజాపాలన అందిస్తున్నారని, రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నా ఆరడుగుల హరీశ్‌రావు రాజీనామా చేసి మాట నిలబెట్టుకోవాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 70 సంవత్సరాల సమైక్యాంధ్ర పాలనలో ప్రభుత్వాలు 70 వేల కోట్లు అప్పు చేస్తే కేసీఆర్ 10 సంవత్సరాల పాలనలో 8 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు. సంవత్సరానికి 60 వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. బంగారు పళ్లెంలో కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించామని హరీశ్‌రావు అన్నారని, అందులో చూస్తే ఎనిమిది లక్షల కోట్ల అప్పు ఉన్నదన్నారు. లక్ష, రెండు లక్షల కోట్ల అప్పు ఉన్నదని దాచిపెట్టి, మూసిపెట్టి పరిపాలించిన టీఆర్ఎస్ ప్రభుత్వం చిప్ప చేతికిచ్చిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సోనియమ్మ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఇంద్రకంటి వెంకటేష్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, సింగిల్విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య సింగయ్యశెట్టి ఉన్నారు.

పన్నులు చెల్లించి దేశాభివృద్ధికి సహకరించాలి

- ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ సుమిత పరమట



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ సుమిత పరమట

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 19 : ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి దేశాభివృద్ధికి సహకరించాలని ఆదాయపు పన్నుల శాఖ అదనపు కమిషనర్ సుమిత పర మట అన్నారు. ఆదాయపు పన్ను రీఫండ్‌కు అక్రమ మార్గాలను అనుసరించొద్దని ఆమె సూచించా రు. శుక్రవారం వనపర్తి ఐడీవోసీ కార్యాలయంలో ఉద్యోగులకు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు అంశంపై ఏర్పాటుచేసిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆమె జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదాయ పన్నులో మినహాయింపులకు ప్రభుత్వం వివిధ పథకాలతో ఉద్యోగులకు అవకాశం కల్పించినా సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. కొందరు ఉద్యోగులు పన్ను మినహాయింపు పొందేందుకు రిటర్న్సుల్లో తప్పుడు సమాచారం నమోదు చేస్తు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ఢిల్లీ, మహారాష్ట్రలలో 20 శాతం, 30 శాతం రీఫండ్ తీసుకుంటుంటే, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం చాలామంది 90 నుంచి వందశాతం రీఫండ్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ రేంజ్-5 పరిధిలో తప్పుడు వివరాలు సమర్పించిన రిటర్న్సులు 14వేలు గుర్తిస్తే అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే 10,635 ఉన్నాయని తెలిపారు. రీఫండ్ ఇప్పించి 5, 10 శాతం కమీషన్లు పొందేందుకు ఐటి ప్రాక్టీషనర్లు తప్పుడు పత్రాలు సమర్పిస్తున్నారని, ఇలాంటివి పట్టుబడితే ఉద్యోగులే తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఉద్యోగులకు వచ్చే మూలవేతనం వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. పలువురు ఉద్యోగులు తమ వేతనాలను తక్కువ వేసి రిటర్న్ ఫైల్ చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖకు సమర్పించిన పత్రాల్లో తప్పులు ఉంటే సవరించి మళ్లీ సమర్పించాలని సూచించారు. ఇందుకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. ఏటా ఆదాయపు పన్ను వివరాలను జూలై 31వ తేదీ వరకు సమర్పించాలన్నారు. వర్క్‌షాపులో అదనపు కలెక్టర్ నగేష్, ఆదాయపు పన్ను శాఖ జిల్లా అధికారి మనోజ్‌కుమార్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ ఒడ్డున చేపల విందు



జూరాల వద్ద చేపలు కొంటున్న పర్యాటకులు



కొన్న చేపలను కోసి శుభ్రం చేస్తున్న జాలర్లు



చేపల వంటకం చేస్తున్న మహిళ

కృష్ణానది ఒడ్డున చేపల వేపుడు నోరూరిస్తోంది. నదికి వరద రోజు రోజుకూ అధికమవుతుండటంతో జూరాల ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి అధికమైంది. మత్స్యకారులు నదిలో పట్టిన చేపలను వచ్చిన జనం కొనుగోలు చేస్తున్నారు. అప్పటికప్పుడు శుభ్రం చేయించి, వండించుకొని అక్కడే తింటున్నారు.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

పాలమూరులో ముసురు వాన

మహబూబ్‌నగర్/ వనపర్తి అర్బన్/గద్వాల/ నారాయణ పేట, జూలై 19 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో శుక్రవారం ముసురువాన కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉన్నా మధ్యాహ్నం 11 గంటల నుంచి ముసురు ప్రారంభమైంది. రాత్రివరకు అప్పుడప్పుడు చిరుజల్లులు పడ్డాయి. ● వనపర్తిలో కురుస్తున్న వర్షాలతో రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. జిల్లాలో వరి నాట్లుకూడా ఊపందుకున్నాయి. శుక్రవారం జిల్లాలోని చిన్నంబావి మండలంలో అత్యధికంగా 13.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ● జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో 14.5 మిల్లీమీటర్లు, గట్టులో 13.3, మల్దకల్‌లో 11.5, కేటీదొడ్డిలో 11, ధరూర్, ఇటిక్యాలలో 10, గద్వాలలో 8.6, ఉండవెల్లిలో 7.3 మి.మీ. వర్షం కురిసింది. ● నారాయణపేట జిల్లా వ్యాప్తంగా కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. కోస్గి మండలంలో 24.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలంలో 15.4 మి.మీ., మక్తల్ మండలంలో 5.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

జూరాల నుంచి కృష్ణానదికి తరలివెళ్తున్న వరద



సంగమేశ్వరం ఆలయం భీమ లింగేశ్వరం వద్ద కృష్ణానది ప్రవాహం

కొల్లాపూర్, జూలై 19 : ఎగువ ప్రాంతంలో వరుసగా కురుస్తున్న వర్షాలతో పోటెత్తిన వరద నీరు జూరాలకు చేరడంతో వరద జలాలు కృష్ణానదికి తరలి వస్తున్నాయి. దీంతో సంగమేశ్వరాలయం సమీపంలోని భీమలింగేశ్వరం మీదుగా వరద జలాల ప్రవాహం కొనసాగు తుంది. సప్తనదుల సంగమేశ్వరాల యాన్ని తెలుగు రాష్ట్రాల ప్రజలు దర్శించుకుని చివరి సారి పూజలు నిర్వహించను న్నారు. మరో 15 నుంచి 20రోజుల్లోపు వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే సంగమేశ్వరాలయంలోకి నీరు చేరుతుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. వరద నీటిలో ఆరు నెలల పాటు జలదివాసంగా ఉండనున్న సంగమేశ్వరాలయాన్ని దర్శించేందుకు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.


కృష్ణా నదికి వరద



పస్పుల పుష్కరఘాట్ వద్ద నీటి ఉధృతి

కృష్ణ/మక్తల్, జూలై 16: కర్ణాటక, మహారాష్ట్రలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి ఆల్మట్టి ప్రాజెక్టు నుంచి దిగువకు వరదనీరు వదిలారు. కృష్ణ మండలంలో కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తోంది. వేసవిలో నీరు లేక ఎడారిగా ఉండేది. వరద నీరు రావడంతో నిండుకుండలా మారింది. నది పరివాహక రైతులు తమ మోటార్లులాగి ముందస్తుగా భద్రపర్చు కున్నారు. నదిలోకి ప్రజలు, మత్స్యకారులు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు చాటింపు వేయించారు. అలాగే మక్తల్ మండలం పస్పుల పుష్కరఘాట్ వద్ద వరదనీటి ఉధృతి పెరిగింది. నదిలో వరద పెరిగిన నేపథ్యంలో నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నీటి ఉధృతి క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వరద ఉధృతి ఇలాగా ఉంటే జూరాల నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి



వరద నీటితో కళకళలాడుతున్న జూరాల జలాశయం

ధరూరు, జూలై 19 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. వరద ఎక్కువవుతుండటంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. జాలరులు చేపలవేటకు వెళ్లొద్దని సూచించారు. వరద తాకిడి అధికమవుతుండటంతో పాటు, స్థానికంగా తుఫాను ప్రభావం ఉండటంతో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు రావొద్దని హెచ్చరించారు. ప్రాజెక్టు నుంచి 33,190 క్యూసెక్కుల నీటిని జెన్‌కో జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నారు. మొత్తం ఐదు యూనిట్ల ద్వారా 160 మోగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. అలాగే నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 1,300, ఎడమకాల్వకు 870, కుడి కాలువకు 367, సమాంతర కాలువకు 600, భీమా లిఫ్ట్-2కు 750, మొత్తంగా 37,905 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో బీచుపల్లి వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న ప్రయాణి కులు వాహనాలను ఆపుకొని కృష్ణానది అందాలను తిలకిస్తున్నారు.

పది నిమిషాలు ముందే పాఠశాలకు రావాలి

- విద్యార్థులకు కనీస అభ్యసన సమర్థ్యాలు నేర్పించాలి

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి

- ఏనుగొండ ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ



ఏనుగొండ పాఠశాల విద్యార్థితో చదివిస్తున్న వెంకటనరసింహారెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 19 : ఉపాధ్యాయులందరూ పాఠశాల సమయంకంటే పది నిమిషాలు ముందే రావాలని, విద్యార్థులకు ఇదే సమయాన్ని అలవాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ ఈ.వెంకటనరసింహారెడ్డి ఆదేశించారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో గల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. 'ఎలా చదువుతున్నారు. విద్యార్థుల బోధన ఎలా సాగుతోంది' అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు తప్పనిసరిగా పది నిమిషాలు ముందే రావాలని సూచించారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా తరగతులు నిర్వహించాలన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అన్నీ అందాయా అని అడిగి తెలుసున్నారు. శనివారం జరగనున్న తల్లిదండ్రుల సమావేశం తప్పక నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం వివరాలను అడిగా తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం వండే పరిసరాల, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణ వర్షం కారణంగా బురదయంగా ఉండటంతో ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ అధికారులకు ఫోన్ చేయగా, వెంటనే మునిసిపల్ సిబ్బంది పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, సీఎంవో బైకాని బాలుయాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్మీ అధికారులుగా ఎంపికై దేశరక్షణకు పాటుపడాలి

- ఎన్‌సీసీ 37వ కంపెనీ హైదరాబాద్ గ్రూప్ కమాండ్ కల్నల్ అనిల్‌కుమార్

జడ్చర్ల, జూలై 19 : ఆర్మీ అధికారులుగా ఎంపికై దేశరక్షణకు ఎన్‌సీసీ క్యాడెట్స్ పాటుపడాలని ఎన్‌సీసీ 37వ కంపెనీ హైదరాబాద్ గ్రూప్ కమాండ్ కల్నల్ అనిల్‌కుమార్ సూచించారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని ఎన్‌సీసీ 37వ కంపెనీ హైదరాబాద్ గ్రూప్ కమాండ్ కల్నల్ అనిల్‌కుమార్, 8వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్‌కె సింగ్‌లు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కళాశాలలో 1963లో ఎన్‌సీసీ విభాగం ప్రారంభం అయ్యిందని, నాటి నుంచి నేటి వరకు ఎందరో ఎన్‌సీసీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకున్నారన్నారు. అనంతరం కళాశాలలోని ఎన్‌సీసీ విభాగంలో ఎన్‌సిసి శిక్షణ రికార్డులు, కార్యకలాపాల డైరీ, ఇతర రికార్డులను వారు పరిశీలించారు. కళాశాలలో నిర్వహించిన శిక్షణ కార్యకలాపాలను ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ యాదయ్య వివరించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, ఎన్‌సీసీ విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

హడలిపోతున్న వెల్కిచర్ల గ్రామస్థులు

- కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి

- వరుసగా ఆరు లేగదూడలను చంపితిన్న చిరుత

- రాత్రి వేళ బయటికి రావడానికి భయపడుతున్న గ్రామస్థులు

- చిరుతను పట్టి బంధించాలని గ్రామస్థులు విన్నపం



మృతి చెందిన లేగదూడను చూసి విలపిస్తున్న రైతు బాలస్వామిని ఓదార్చుతున్న నాయకులు

భూత్పూర్, జూలై 19 : వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన పశువుల పై వరుస దాడులు చేసి లేదూడలను చంపి తింటున్న చిరుత పులి గ్రామస్థులకు కునుకు లేకుండా హడలెత్తిస్తున్నది. వరుసదాడులతో ఆరు లేగ దూడలను చంపి తిన్న చిరుతను చూసి గ్రా మస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వివరా ల్లోకి వెళితే.. ఈనెల 16న మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో తిరుపతిరెడ్డి అనే రైతుకు చెందిన లేగ దూడను చిరుత దాడి చేసి చంపితిన్నది. విషయాన్ని గ్రామస్థులు జిల్లా ఫారెస్టు అధికారులకు తెలిపారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాఘవేందర్‌రెడ్డి, ఇతర అధికారులు రెండు రోజుల తర్వాత వచ్చి చిరుత పులి దాడి చేసి తిన్న ప్రదేశాన్ని పరిశీలించారు. జాగ్రత్తగా ఉండాలని రైతులకు, గ్రామస్థులకు సూచనలు చేసి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి మళ్లీ చిరుత పులి గ్రామం సమీపంలో ఉన్న గడ్డాల బాలస్వామి అనే రైతు పశువుల పాక దగ్గరకు వచ్చి రెండు లేగ దూడలను చంపి తిన్నది. మరో లేగదూడను గాయపర్చి వెళ్లిపోయింది. అదే వరుసలో ఉన్న మరో రైతు మల్లాయపల్లి మల్‌రెడ్డి పశువుల పాక దగ్గర కట్టేసి ఉంచిన పశువులపై చిరుత దాడి చేసి ఒక లేగ దూడను తిని, మరో లేగ దూడను తీవ్రంగా గాయ పర్చి వెళ్లిపోయింది. గ్రామంలో వరుస చిరుత దాడుల్లో లేగదూడలు చనిపోవడంతో రైతులు వ్యవసాయ బావుల వద్దకు పోవడానికి భయపడుతున్నారు. పాడిపశువులపై జీవిస్తున్న మా కుటుంబాలకు చిరుత పశువుల సంపదను నాశనం చేస్తున్నదని, దీన్ని ఇలాగే వదిలి పెడితే గ్రామంలో ఉన్న పశువులతో పాటుగా మనుషుల పైన దాడులు చేసే ప్రమాదం ఉందని స్థానిక రైతులు, గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వెల్కిచర్ల గ్రామాన్ని సందర్శించి లేగ దూడలపై చిరుత దాడి చేసిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మనోధైర్యాన్నిచ్చారు. సంబంధిత శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. చిరుతను సాధ్యమైనంత త్వరగా పట్టుకోవాలని అధికారులకు సూచించారు.

దాడి చేస్తున్నవి హైనా? షికారి కుక్కలా ? తేలాలి

వెల్కిచర్ల గ్రామంలో రెండు మూడు రోజుల నుంచి వరుసగా లేగ దూడలను చిరుత పులి దాడి చేసి చంపి తింటున్నందున శుక్రవారం జిల్లా ఫారెస్టు అధికారులు నిరంజన్, రాఘవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. లేగదూడలపై దాడి చేసి చంపి తింటున్నది హైనా అయి ఉండవచ్చని, లేదా షికారి కుక్కలు కావచ్చని వారు తెలిపారు. చిరుత పులి అయితే జంతువులను చంపి తినేటప్పుడు ముందుగా గొంతును పట్టి కొరుకుతుందని, ఆ తరువాత వెనుకభాగం తింటుందని అన్నారు. లేగదూడలను ఏ జంతువు దాడి చేసి తింటుందో ఎవరు చూడలేదు. కనుక ఈ విషయంలో బాగా అనుభవం ఉన్న అచ్చంపేట ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు కచ్చితంగా ఏ జంతువు దాడి చేసింది అనే విషయాన్ని త్వరలో వెల్లడిస్తారని అధికారులు పేర్కొన్నారు, సీసీ కెమెరాలు పెట్టి పరిశీలిస్తామని అన్నారు. అదే విధంగా అనుభవజ్ఞులైన వారి సూచనల మేరకు అతి త్వరలో ఏ జంతువు దాడి చేస్తున్నది అనే విషయాన్ని కనుగొంటామని అన్నారు.

'డయల్ యువర్ ఆర్ఎం'కు 12 వినతులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 19 : ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు తెలుసుకోవడానికి ఆర్టీసీ వారు ఏర్పాటు చేసిని 'డయల్ యువర్ ఆర్.ఎం.' కార్యక్రమానికి శుక్రవారం 12 వినతులు వచ్చాయి. అమ్మాపూర్ వనపర్తి బస్సు గోపన్‌పల్లిలో రావడంలేదని, యానగొంది నైట్ హాల్ట్ సర్వీసు ఏర్పాటు చేయాలని నలుగురు ప్రయాణికులు కోరారు, మహబూబ్‌నగర్ నుంచి దౌల్తాబాద్‌కు బస్సు ఏర్పాటు చేయాలని, నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్లకు పల్లెవెలుగు బస్సు ఏర్పాటు చేయాలని, తిరుమల హిల్స్ వద్ద రెక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, మహబూబ్‌నగర్ నుంచి బాలంపేట్ వయా దౌల్తాబాద్ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని, జడ్చర్ల సీహెచ్‌సీ హాస్పటల్ వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని, గద్వాల డిపో బస్ మూసాపేట బస్టాండ్‌కు రావడం లేదని, మహబూబ్‌నగర్ ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు ప్రయాణాలు సాగిస్తుండడంతో నారాయణపేటకు మహబూబ్‌నగర్ నుండి డీలెక్స్ బస్ ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యాయత్నం

గండీడ్, జూలై 19 : పురుగుల మందు తాగి ఓ యువతి ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్న సంఘటన శుక్రవారం మండల పరిధిలోని పగిడ్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. గమనించిన కుటుంబీకులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు 108 వాహనం సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మునిసిపల్ కార్మికురాలికి గాయాలు

భూత్పూర్, జూలై 19 : భూత్పూర్ మునిసిపాలిటీ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి సైదమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మునిసిపాలిటీలోని అమిస్తాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మునిసి పాలిటీలో ఉద్యోగిగా పనిచేస్తున్న సైదమ్మ శుక్రవారం విధులు ముగించుకొని మునిసి పాలిటీ కార్యాలయం నుంచి తన సొంత స్కూటీపై మహబూబ్‌నగర్‌కు వెళ్లుతుండగా అమిస్తాపూర్ సాక్షిగణపతి దేవాలయం దగ్గర ఎదురుగా వస్తున్న మోటారు సైకిలిస్టు డీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న సైదమ్మకు గాయాలయ్యాయి. మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న అమిస్తాపూర్ గ్రామానికి చెందిన నర్సింహ కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని సైదమ్మను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందివ్వాలని ఆసుపత్రి వైద్యులను కోరారు.

బంగారు ఆభరణాలు అపహరణ

నవాబ్‌పేట, జూలై 19 : ఓ ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ విక్రం తెలిపారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి పంచాయతీ పరిధిలోని పోషమ్మగడ్డ తండాకు చెందిన సబావత్ రాజు ఆయన కుటుంబ సభ్యులు బతుకు దెరువు కోసం రెండు నెలలక్రితం ముంబై వెళ్లారు. ఆయన భార్య కాళీబాయి వారం రోజుల క్రితం ముంబై వెళ్లగా ఈనెల 18న ఇంటి పక్కన ఉన్న దేవమ్మ ఫోన్ చేసి మీ ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పగా 19న ఇంటికి వచ్చి చూడగా తాళం విరగొట్టి ఇంట్లో ఉన్న బీరువాలోని రూ 30,000 నగదు, 34 తులాల వెండి, 8 తులాల బంగారం, మంచం కింద ఉన్న 15000 నగదుతో పాటు ఇతర వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కేటీదొడ్డి, జూలై 19 : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని గంగనపల్లె శివారులో విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగనపల్లెకు చెందిన జంగిలమ్మ (46) శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలంలో పశువుల కొట్టాన్ని శుభ్రం చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై భర్త జయప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు.

రుణమాఫీపై వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దు

వంగూరు, జూలై 19: మీ మొబైల్ ఫోన్లకు రైతు రుణమాఫీ పేరుతో వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లను క్లిక్ చేసి సైబర్ నేరాలబారిన పడొద్దని వంగూరు ఎస్‌ఐ మహేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రాప్‌లోన్ తీసుకున్న బ్యాంక్ నుంచి అధికారులు రుణమాఫీకి సంబంధించిన ఎలాంటి లింక్‌లు పంపారని రైతులు బ్యాంక్‌కు వెళ్లి తెలుసుకోవాలన్నారు. మీ మొబైల్ ఫోన్లకు తప్పుడు మెసేజ్‌లతో లింక్‌లు వస్తే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

కల్వకుర్తిటౌన్: సైబర్ నేరస్థులు బ్యాంకుల పేరుతో వాట్సప్ ప్రొఫైల్ ఫోటోలో బ్యాంకు లోగోలతో వస్తున్నాయని ఎస్‌ఐ మాధవరెడ్డి శుక్రవారం ఒకప్రకటనలో వివరించారు. రైతుల ఫోన్లకు వాట్సప్‌లో బ్లూకలర్‌లో ఓ లింక్‌లను పంపి మోసాలకు పాల్పడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్‌క్రైమ్ గురైనవారు వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి రిపోర్టు చేయాలని వివరించారు.

అల్లా చూపిన మార్గంలో నడిస్తేనే స్వర్గలోక ప్రాప్తి

కందనూలు, జూలై 19 : దేవుడు చూపిన మార్గంలో మానవుడు నడిచినప్పుడే స్వర్గలోక ప్రాప్తి సిద్ధిస్తుందని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అరబిక్ యూనివర్సిటీ జామియా నిజామియాకు చెందిన ప్రధాన ఆచార్యుడు సయ్యద్ అజీజుల్లా ఖాదిరి అన్నారు. శుక్రవారం జుమా నమాజ్ సందర్భంగా నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన మస్జిద్ ఏగఫూరియాను ప్రారంభించిన అనంతరం ఆయన ఆధ్యాత్మిక వచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ధర్మం మంచిని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నో ఆధ్యాత్మిక బోధనలు చేశారు. నూతనంగా నిర్మించిన మస్జిద్‌లో భాగస్వాములైన ప్రతీ ఒక్కరిపై అల్లా కృప ఉంటుందన్నారు. మస్జిద్ నిర్మాణం చేసిన వారికి, పాలు పంచుకున్న వారికి ఖియామత్ వరకు అజర్ లభిస్తుందన్నారు. మాజీ మసాజిద్ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత మస్జిద్ కమిటీ అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ మస్జిద్ నిర్మాణంలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం సంఘాల పెద్దలు మహమ్మద్ సాధిక్‌పాషా, హబీబ్‌ఖాన్, యాకుబ్ బాబా జీర్, మహ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ బిన్‌ఉస్మాన్ బావజీర్, షేక్ ఫరీద్‌అహ్మద్, హబీబ్ ఉర్రహ్మాన్, మహమ్మద్ షఫీ ఉల్లా ఖాన్, ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ జహంగీర్, మహమ్మద్ నిరంజన్, మహమ్మద్ హుస్మాన్‌ఖాదర్, అహ్మదుల్లా ఖాన్‌లతో పాటు మస్జిద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

భూ సమస్యల ఫైళ్ల సమాచారం కోసం దరఖాస్తు



కోడేరులో భూ సమస్యలపై సమాచారం కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తుతో బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

కోడేరు, జూలై 19 : తెలంగాణ రాష్ట్రంలో ధరణి వెబ్‌సైట్ ద్వారా భూమి వివరాల్లో తప్పులు జరిగాయని వాటి సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్న భూ సమస్యల ఫైళ్ల సమాచారం (ఆర్‌టీఐ) ద్వారా దరఖాస్తు చేశామని కిసాన్‌మోర్చా మండల నాయకులు బి.రాజు, ఎస్.రమేష్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో తహసీల్దార్‌కు దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు బి.రాజు మాట్లాడుతూ ధరణిలోని లోపాల కారణంగా రైతులు క్రయ విక్రయాలు చేయడానికి రాక కుటుంబాలలో గొడవలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణిలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను కూడా రెవెన్యూ అధికారులు సరి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి వల్ల జరిగిన తప్పులను ఆసరాగా చేసుకుని రెవెన్యూ సిబ్బంది తమ ఇష్టం వచ్చినట్లు మధ్య దళారులను ఏర్పాటు చేసుకుని అందిన వరకు రైతులతో దోచేస్తున్నారన్నారు. మండలం మొత్తం ధరణిలో రైతుల సమస్యల గురించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎలాంటి సమస్యలు ఉన్నాయి తదితర వివరాలు ఇవ్వాలని ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేశామన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు షరీఫ్, రాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకోసం ముందుకు రావాలి



మెగా కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

వెల్దండ, జూలై 19 : సమాజంలో నిరుపేద వర్గాల సేవకై మానవతావాదులు ముందుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐక్యత ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఏవీఆర్ గార్డెన్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకరనేత్రాలయ సహకారంతో పది రోజులపాటు నిర్వహించే మెగా కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది వైద్యానికి నోచుకోని నిరుపేదలు ఉన్నారని, వారికోసం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కంటిశుక్లాలు ఆపరేషన్లు చేస్తామని, అదేవిధంగా అవసరమున్న వారికి కంటిఅద్దాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, శంకర నేత్రాలయ సభ్యుడు అరుణ్‌కుమార్, సభ్యులు రమేష్‌నాయక్, కొండల్, మల్లయ్య, యాసుఫ్, రాహుల్, శ్రీపతి, నాయకులు వెంకట్‌రెడ్డి, నరేందర్, శ్రీరాములు ఉన్నారు.

'ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీని ప్రకటించాలి'

తిమ్మాజిపేట, జూలై 19 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, డీఏలను వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ తిమ్మాజిపేట మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం తిమ్మాజిపేట మండల కమిటీ తరఫున యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎండి.నసీర్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పీఆర్సీ పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయ పోస్టులకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని వారు కోరారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఎమ్మెల్సీ ఓటు హక్కును కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులను కల్పించి పాఠశాల పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులను నియమించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మణ్, రాములు, రాధాకృష్ణ, కుర్మయ్య, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలను వెంటనే నెరవేర్చాలి'

తెలకపల్లి, జూలై 19 : ప్రభుత్వంలో గతంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని ఛలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జీవో నెంబరు 10ని రద్దు చేయాలని 65 సంవత్సరాలు పైబడిన టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్స్‌కు లక్ష రూపాయలు వారి రిటైర్మెంట్ తర్వాత ప్రస్తుతం ఇస్తున్న వేతనంలో సగం వేతనం నెలవారిగా పింఛన్ ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్నామని ఇప్పటికీ మా సమస్యలు పరిష్కరించకపోతే ప్రగతిభవన్ ముట్టడి ఉంటుందని తెలియజేశారు. వ్యవసాయ రైతు సంఘం నాయకులు గోపాస్ లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు అలివేలమ్మ, తిరుపతమ్మ, లక్ష్మీ, జయ, లక్ష్మీకాంతమ్మ, సుకన్య ఆయాలు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

అమ్రాబాద్, జూలై 19: ఇటీవల బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను పాఠశాలల నుంచి వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్కా రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమ్రాబాద్ పదర మండలాల పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రామస్వామి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, సరిపడ సిబ్బందిని నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయ బదిలీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీటీఎఫ్ జిల్లా, మండల నాయకులు, లక్షణ్ నాయక్, ఎల్లయ్య, తిరుపతయ్య, పాండయ్య విజయ్, సురేష్, శ్రీశైలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

- గిరిజన తండాల్లో రోడ్ల దుస్థితి
- బీటీ రోడ్లుగా మార్చాలని కోరుతున్న గిరిజనులు

ఊర్కొండ, జూలై 19: చిన్నపాటి చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారి కాలినడకన వెళ్లలేని పరిస్థితి నెలకొందని గిరిజన తండాల ప్రజలు మనోవేదన చెందుతున్నారు. మండలంలోని రెడ్యా తండా, ఠాకూర్ తండా, బుర్గువానికుంట తండా, అమ్మపల్లి తండా, బావాజీ తండా, బాల్యలోక్య తండాలకు మట్టి రోడ్లు ఉన్నాయి. దాంతో వర్షాకాలం వస్తే తమకు నరకం కనిపిస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. గత పది సంవత్సరాల్లో తమ రోడ్లకు కనీసం తట్ట మట్టి వేసి గుంతలు సరి చేసిన పాపన పోలేదని ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై తండావాసులు విమర్శిస్తున్నారు. తండాల నుంచి ప్రతి చిన్న పనికి సైతం తమ గ్రామ పంచాయతీలు ఉన్న గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుందని, రోడ్డు సరిగా లేక పోవడం, వర్షం వస్తే ద్విచక్ర వాహనాలు జారీ కిందపడి గాయాలైన సంఘటనలు కోకోల్లలుగా ఉన్నాయని మనోవేదన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ఎవరికైన ఎలాంటి ఇబ్బందులు తలెత్తితే వెళ్లలేక ఉన్నచోటే ఊపిరి ఆగిపోతున్నదని, జ్వరం బారిన పడితే పట్టణాలకు తీసుకువెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల కోసం ఓట్లు వేయాలని వచ్చే నాయకులను చూశాం.. మా రోడ్లు బాగు చేసే వారు మాత్రం ఎవరూ లేరని విమర్శిస్తున్నారు.

రోడ్ల దుస్థితిని గుర్తించి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి తమ రోడ్లను బీటీగా మార్చి తమ జీవితాలను బాగు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

తండాల రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలి



ప్రతి చిన్న పనికి గ్రామ పంచాయతీ ఉన్న గ్రామాలకు వెళ్లాల్సి రావడంతో బురదమయమైన రోడ్లపై వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే ద్విచక్ర వాహనం తీసుకువెళ్లాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకొని పోవాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా గిరిజన తండాల రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని కోరుతున్నాం.

- ఆర్.లచ్చీరామ్‌నాయక్, ఠాకూర్‌తండా



చిన్నపాటి వర్షానికి బురదమయమైన బుర్గువానికుంట తండా రోడ్డు

అస్తవ్యస్తంగా ఇంటర్నల్ రోడ్లు

- పట్టించుకోని అధికారులు



గ్రంథాలయం సమీపంలో ఇంటర్నల్ రోడ్డుపై సింగిల్‌ఫేస్ మోటార్ ద్వారా వచ్చిన వృథా నీరు



సెల్‌ఫోన్ టవర్ మీదుగా వెళ్లే రహదారి కంపచెట్లతో..

అమ్రాబాద్, జూలై 19: అమ్రాబాద్ మండల కేంద్రంలో పలు వార్డులలో ఇంటర్నల్ రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అచ్చంపేట-మద్దిమడుగు ప్రధాన రహదారి నుంచి గ్రంథాలయానికి వెళ్లే దారి మొత్తం గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు వెంట పోయే పాదచారులతో పాటు ద్విచక్ర వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గ్రంథాలయం సమీపంలో ఈ దారి పక్కనే ఉన్న సింగిల్‌ఫేస్ మోటార్ నీరు రోడ్డుపైకి రావడంతో రోడ్డుపైన గుంతలు బురదమయంగా మారాయి.

ప్రధాన రహదారి నుంచి సెల్‌ఫోన్ టవర్ల మీదుగా వెళ్లే ఇంటర్నల్ రోడ్డుకు రెండువైపులా కంపచెట్లు పెరిగి మూసుకుపోయాయి. ఈ దారి వెంట ప్రయాణించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో చాలావరకు సీసీరోడ్లు మంజూరు అయినప్పటికీ ఈ రెండు రోడ్లకు నిధులు మంజూరు చేయకపోవడంతో సీసీ నిర్మాణం జరగలేదు. సంబంధిత కాలనీవాసులు ఈ రోడ్ల దుస్థితిపై గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నో మార్లు విన్నవించినా కూడా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం..



అమ్రాబాద్ మండల కేంద్రంలో కొన్ని వార్డులలో ఇంటర్నల్ రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఇటీవలనే తమ దృష్టికి వచ్చింది. ఇంటర్నల్ రోడ్ల మరమ్మతు పనులను తక్షణమే చేయించి ఈ వార్డులలో నివసిస్తున్న వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

- డాక్టర్ అనిల్‌కుమార్, ప్రత్యేక అధికారి, అమ్రాబాద్

యాగ హోమాలతో సుభిక్షం, సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, జూలై 19 : యాగ హోమాలతో సుభిక్షం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చండీ హోమంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు పాల్గొని పూజలు నిర్వహించి సామూహిక అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో సుఖసంతోశాలతో జీవించేందుకు చేపట్టిన ఆయుత చండీయాగం దిగ్విజయంగా పూర్తి చేసుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. హోమ యాగాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అన్ని రకాల దోషాలు తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని అన్నారు. ఈ నెల 7 నుంచి 15రోజుల పాటు అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఏర్పాటు చేయడం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దోషాలు తొలగిపోయేందుకు వివాహాలు జరగని వారికి సంతానం కలగని వారి కోసం ప్రత్యేకంగా యాగం చేసినట్లు అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు అండదండలు అందిస్తానని తెలిపారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులు

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- సిద్దాపూర్‌లో రూ. 75లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు భూమిపూజ

అచ్చంపేట అర్బన్, జూలై 19: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండలంలోని ఏజెన్సీ గ్రామమైన సిద్దాపూర్ గ్రామంలో రూ.75లక్షల వ్యయంతో దాదాపు 15రోడ్లకు భూమి పూజ చేశారు. అదే విధంగా గ్రామంలోని రైతు వేదికవద్ద వన మహోత్సవం సందర్భంగా ఖాళీ స్థలంలో మొక్కలు నాటి వాటికి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రెండు లక్షలు రుణ మాఫీతో రైతు సంబు రాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేసి రైతు బాంధవుడు అయ్యారన్నారు. సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అచ్చంపేట మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, పంచాయతీ రాజ్ డీఈ చంద్రకళ, ఏఈ సందీప్‌రెడ్డి, నాయకులు బి.మనోహర్, బి.రాజేష్‌రెడ్డి, నర్సయ్యయాదవ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

సమస్యలను తెలుసుకున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, జూలై 19 : కొల్లాపూర్ పట్టణంలోని ఐదవ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌ను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులో శివాలయం సమీపంలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను మునిసిపల్ ప్రజాప్రతినిధులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నివాస గృహాల వారికి డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మునిసిపల్ సిబ్బంది చర్యలు చేపట్టాలని, వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పాత మిద్దెల్లో నివాసం ఉండే వారికి జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేయాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. మునిసిపల్ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా కాలనీల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొనకుండా వీధి లైట్ల సమస్య ఏర్పడకుండా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కౌన్సిలర్లు షేక్.రహీంపాష, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, ఖాదర్‌పాష, సింగిల్ విండో డైరెక్టర్ నరసింహ, వంగ రాజశేఖర్‌గౌడ్, దూరయ్య పాల్గొన్నారు.



కాలనీ సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సిబ్బంది సమయపాలన పాటించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతలను ఈ నెల 4న స్వీకరించిన తర్వాత శుక్రవారం మొదటిసారి జడ్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జడ్పీ పాలక వర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 4న కలెక్టర్ ప్రత్యేక అధికారి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్ కార్యాలయానికి ఆకస్మికంగా చేరుకుని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గోపాల్‌నాయక్ కలెక్టర్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చాంబర్‌లో జడ్పీ సీఈవోతో కలెక్టర్ సమావేశమయ్యారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి సిబ్బందితో పరిచయం చేసుకుని సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని పలు శాఖల డివిజనల్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. కార్యాలయం ఆవరణలో విద్యుత్ దీపాలు లేవని, తాగునీటి సమస్యతో పాటు పారిశుధ్య పనులు జరగడం లేదని పలువురు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యాలయ సముదాయంలోనే మెడికల్ కళాశాల విద్యార్థినులు నివాస సముదాయంగా ఉంటున్నారని, విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారని కలెక్టర్‌కు పలువురు అధికారులు తెలిపారు.

అందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే పారిశుధ్య కార్యక్రమాలను పురపాలక సిబ్బంది ద్వారా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు. విద్యుత్ దీపాలతో పాటు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గోపాల్‌నాయక్, పర్యవేక్షకులు యూసుఫ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



ఆర్టీసీ డిపోలో ముగ్గులు వేసిన మహిళా ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం

కల్వకుర్తిటౌన్, జూలై 19 : ఆర్టీసీ ఉద్యోగుల అంకితభావంతో పనిచేయాలని కల్వకుర్తి టీజీఆర్టీసీ డీఎం సుభాషిణి అన్నారు. శుక్రవారం టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు లక్ష్యే - లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులను ప్రోత్సహించేందుకుగాను ఆటాపాట కార్యక్రమాలతో పాటుగా వాలీబాల్, కుర్చీలాట, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడారు. ఎండీ సూచించిన విధంగా ప్రతిరోజు తాము పొందే ఆదాయంతో పాటు, లక్ష రూపాయలను అదనంగా సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. ఉద్యోగులందరు సమష్టిగా సంస్థ అభివృద్ధికి కృషిచేయాలని వివరించారు. ఇలాంటి ఆటలు, పాటల పోటీలు నిర్వహించడం ద్వారా వారు ఉత్సాహంగా పని చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం..

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని డీఎం సుభాషిణి అన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5గంటలవరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కల్వకుర్తిడిపో నుంచి మాల్ వరకు గతంలో నిర్వహించిన సర్వీస్‌ను పునరుద్ధరించాలని, కర్కల్‌పాడ్ వద్ద ఉన్న రిక్వెస్టు స్టాప్‌ను పర్మినెంట్ చేయాలని, ఆయా రూట్‌లలో బస్సు సంఖ్యను పెంచాలని, ప్రత్యేకంగా రిక్వెస్టు స్టాప్‌లను ఏర్పాటుచేయాలని, కొన్ని రూట్‌లలో బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. కల్వకుర్తి టీజీఆర్టీసీ డిపో ద్వారా ప్రయాణీకులకు మెరుగైన సేవలను అందిస్తామని, డిపో అభివృద్ధికి ప్రయాణికులు సహకరించాలని డీఎం కోరారు. ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

22న పాపన్న గౌడ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

కొల్లాపూర్, జూలై 19: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంజీఎల్‌ఐ అతిథి గృహ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా గౌడ సంఘం నాయకులు వంగ రాజశేఖర్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, పటపర్ల శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణగౌడ్ విలేకర్లతో మాట్లాడారు. పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు హాజరవుతారని వారు వెల్లడించారు. విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున జిల్లా నలుమూలల నుంచి గౌడ కులస్తులు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోవిందుగౌడ్, సుదర్శన్‌గౌడ్, తమటం సాయికృష్ణగౌడ్, మధుసూదన్‌గౌడ్, శివన్నగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటస్వామిగౌడ్, యాదగిరిగౌడ్, భాస్కర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జైలుశిక్ష, జరిమానా

కల్వకుర్తిటౌన్, జూలై19 : మద్యం సేవించి వాహనాలు నడిపి తనిఖీల్లో దొరికిన వారికి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి శుక్రవారం తెలిపారు. అతిగా మద్యంసేవించి వాహనాలు నడిపిన దసర్ల అర్జున్‌కు మూడు రోజుల జైలు శిక్ష, రూ.100జరిమానా, సభవట్ మున్య, అంగోతు శ్రీను, బత్తుల పర్వతాలు వీరికి రెండు రోజులు జైలుశిక్ష ఒక్కొక్కరికి రూ.100 జరిమానాను కల్వకుర్తి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కావ్య విధించినట్లు ఆయన వివరించారు.

జిల్లాలో నార్కొటిక్స్ డ్రగ్స్ అధికారుల విస్తృత తనిఖీలు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 19 : జిల్లా కేంద్రంలో బస్టాండ్ పరిసర ప్రాంతంలో శుక్రవారం పోలీసులు, నార్కోటిక్స్ డ్రగ్స్ అధికారులు విస్తృత తనిఖీలను నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ బృందం ఆర్‌ఐ జగన్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో షాపులు, హోటళ్లు, స్టాళ్లల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు తనిఖీలు చేపట్టి సాధ్యమైనంత వరకు డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు జగన్ పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట



పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పెద్దకొత్తపల్లి, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తుందని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్ర పటాలను ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేసి పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. మాజీ తాజా సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పి.చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు దండు నరసింహ, రవికుమార్, ధర్మేందర్, బద్యానాయక్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బి.బాలస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు టి.కృష్ణయ్య, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, నాయకులు జే.కురుమూర్తి, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రావు, అశోక్‌రెడ్డి, డబ్బు ఎల్లయ్య, తగిలి వెంకటస్వామి, సుదర్శన్‌రెడ్డి, మల్లయ్య, శివశంకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వంగూరు: తెలంగాణ ప్రభుత్వం రూ. లక్షలోపు రుణాలను మాఫీ చేయడంపై శుక్రవారం మండలంలోని గాజర, తిర్మలగిరి, ఉప్పల్‌పహాడ్ గ్రామాల్లో సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాపికి క్షీరాభిషేకం చేశారు. ఏకకాలంలో రుణమాఫీ చేసినందుకు సంతోషంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కదారి వెంకటయ్య యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఖలీల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో 2 లక్షల రణ మాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు రంగారెడ్డి, మాజీ సర్పంచ్ లింగమయ్య, నాయకులు, జంగిరెడ్డి, శ్రీశైలం, రాజమౌళి, గుద్దటి బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

రైతు రుణమాఫీ హర్షణీయం

కందనూలు, జూలై 19 : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అతికొద్దికాలంలోనే రైతుల పట్ల చిత్తశుద్ధితో రైతులను రైతురుణమాఫీకి పూనుకోవడం హర్షణీయమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రుణమాఫీ చేస్తుండటం చరిత్రాత్మకం

కల్వకుర్తి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయడంలో భాగంగా మొదటి విడతలో రూ.లక్షను అమలు చేయడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, తోటపల్లి మాజీ సర్పంచ్ పసుల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ జరిగి తీరుతుందని తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

ఉప్పునుంతల, జూలై 19: రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే విధంగా కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీపాషా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మబాట అంగన్‌వాడి కేంద్రాల బాట కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరోగ్యలక్ష్మి భోజనం వివరించారు. కార్యకర్తలు పార్వతమ్మ, వసంత తదితరులు ఉన్నారు.

● కల్వకుర్తి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేష్మబేగం, రెహానా బేగం, అంగన్‌వాడీ టీచర్ ఆలివేలు కోరారు. కల్వకుర్తి పట్టణం సుభాష్‌నగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

● చారకొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని టీచర్లు భాగ్యమ్మ, అక్షర అన్నారు. శుక్రవారం మండలంలోని చంద్రాయన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని టీచర్లు ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రూ.30వేల ఆర్థిక సహాయం

కల్వకుర్తి, జూలై 19 : కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన కడ్తాల్ వెంకటయ్య అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.30 వేలను సమకూర్చారు. శుక్రవారం బాధితులు వెంకటయ్యకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.30వేలను అందజేశారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, నిజాముద్దీన్, జలాల్, జంగయ్యగౌడ్, తోటపల్లి అనిల్‌కుమార్, శశిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పాండు, రవి, స్వామి, శ్రీశైలం, గౌస్, బాలకృష్ణ, శ్రీను, శ్రీకాంత్‌గౌడ్, రామకృష్ణ, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.